క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆదామ్‌బాషా

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చూసుకోవాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా హెచ్‌ఎంలకు సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మధ్యాహ్న భోజన నిర్వహణపై హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సచివాలయ సంక్షేమ సహాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎంఈఓలు మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు



కుర్చీలాట ఆడుతున్న ఉపాధ్యాయినులు

గడివేముల: స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ఉపాధ్యాయినులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయినులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం బహుమతుల అందజేస్తామని ఎంఈఓ–2 విమలా వసుంధరదేవి తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కా ర్యాలయ సమావేశ భవనంలో ఎంఈఓ వసంతలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంలు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, స్కూల్ కమిటీ చైర్మన్లతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. హెచ్‌ఎంలు, స్కూల్ కమిటీ చైర్మన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేసి మధ్యాహ్న భోజనా న్ని పరీక్షించాలన్నారు.ఏవైనా లోపాలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ సునీల్‌కుమార్

ఓర్వకల్లు: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సునీల్ కుమార్ సూచించారు. ఈ నెల 7న గణపయ్య విగ్రహాలు ప్రతిష్టించనున్న నేపథ్యంలో నిర్వాహకులతో బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడారు. విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. డీజే, సౌండ్ బాక్స్‌లకు ఎలాంటి అనుమతిలేదన్నారు. ప్రజల రాకపోకలకు ఇబ్బంది కల్గించేలా రోడ్లపై మండపాల ఏర్పాటు చేయొద్దని సూచించారు. మండపాల కమిటీ సభ్యులు తప్పనిసరిగా పోలీసు స్టేషన్‌లో వివరాలను నమోదు చేయించాలని సూచించారు. మండపాల వద్ద సీసీ కెమరాలు అమర్చుకోవాలని, విగ్రహాలను నిమజ్జనం చేసే చెరువు, వాగుల వివరాలను పోలీసులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని తెలిపారు.

6న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియంలో ఈనెల 6వ తేదీన జిల్లా స్థాయి అండర్–14, అండర్–16, అండర్–18, అండర్–20, అండర్–23 వయస్సు విభాగాల్లో బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సి.సుబ్బరత్నాలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలన్నారు. ప్రతిభ కనబరచి ఎంపికయిన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98664 94372 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉత్తమ 'బోధనకు' గౌరవం !

● నేడు అవార్డులు అందుకోనున్న ఉపాధ్యాయులు



విద్యార్థులకు బోధన చేస్తున్న దృశ్యం

పాణ్యం : దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఏటా ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు అందజేయడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో పాణ్యం, కోడుమూరు నియోజకర్గం నుంచి టీచర్లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరు గురువారం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉత్తమ ఉపాధ్యాయుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

చదువు విలువ తెలియజేస్తూ..



విద్యార్థులకు చదువు విలువ తెలయజేస్తూ విద్యా బోధన చేస్తున్నాం. బోధన విద్యార్థులకు అర్థమవ్వ లేదనిపిస్తే మరోమారు వివరిస్తూ ముందుకు సాగుతున్నాం. తల్లిదండ్రుల వద్దకే వెళ్లి విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ చైతన్య పరుస్తున్నాం. అప్పుడప్పుడు సామాజిక బాధ్యతను వివరిస్తాం. దాదాపు 22 ఏళ్లపాటు పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేశా. ఉత్తమ అవార్డుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– జీనత్ జహాన్, గని ఎంపీపీ(ఉర్దూ) స్కూల్

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుని పేరు	కేటగిరీ	పని చేసే స్థలం
ఫర్జానా	పీజీటీ	ఏపీఎంఎస్, పాణ్యం
జగన్‌మోహన్‌రెడ్డి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్‌ఎస్, గోరుకల్లు
జీనత్‌జహాన్	ఎస్‌జీటీ	ఎంపీపీస్కూల్, గని
జ్ఞాన విజయ భారతి	ఎస్‌జీటీ	ప్రభుత్వ పాఠశాల, పాణ్యం
కృష్ణనాయక్	ప్రిన్సిపాల్	ఏపీటీడబ్ల్యూఆర్‌ఎస్ స్కూల్, పాణ్యం
ఎస్.మహమ్మద్ రఫీక్	స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు)	జెడ్పీ హైస్కూల్, మునగాలపాడు, కర్నూలు
బి.కిరణ్ కుమార్	ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం	ఎంపీపీఎస్, ఆర్.కె దుద్యాల, కర్నూలు
బి.శ్రీనివాసరెడ్డి	స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ)	జెడ్పీ హైస్కూల్, ముజఫర్ నగర్, కల్లూరు
పుష్పావతమ్మ	ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం	ఎంపీపీఎస్ నిర్మల నగర్, కల్లూరు
జే.నాగేశ్వరయ్య	ఎస్‌జీటీ	జి.బి తాండా, ఓర్వకల్లు

పేద విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యం



పేద విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. దేశభక్తి, క్రమశిక్షణ కోసం 8,9,10 తరగతలు విద్యార్థుల కు స్కాట్స్ అండ్ గౌడ్స్‌పై శిక్షణ ఇస్తున్నాం. సమాజ సేవలకుగా తీర్చిదిద్దేందుకు తమవంతు కృషి చేస్తున్నాం. ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– షేక్ ఫర్జానా, పీజీటీ ఎకనామిక్స్, ఏపీ మోడల్ స్కూల్, పాణ్యం

విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ బోధన



విద్య ప్రాముఖ్యతను వివరిస్తూ బోధన చేస్తున్నాం. పేద విద్యార్థుల విద్యాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. తల్లిదండ్రులకు చదువుతో ఉన్న ప్రయోజనాలు వివరించి పిల్లలను బడికి పంపేలా తనవంతు కృషి చేస్తున్నా. ప్రస్తుతం మా స్కూల్‌లో విద్యార్థుల సంఖ్య కూడా పెరిగింది. అవార్డు రావడం సంతోషంగా ఉంది.

– జే కృష్ణానాయక్ ప్రిన్సిపాల్ ఏపీటీబ్ల్యూఆర్‌ఎస్, పాణ్యం

సేవలకు గుర్తింపు సంతోషకరం



1995 నుంచి ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. 1995 సి.బెళగల్ మండలం కొత్తకోట పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరా. నా వంతు గా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేశా. ప్రస్తుతం కల్లూరు అర్బన్ పరిధిలోని నిర్మలనగర్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నా. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.

– కె. పుష్పావతమ్మ, ప్రధానోపాధ్యాయురాలు, ఎంపీపీఎస్ నిర్మల నగర్, కల్లూరు

చాలా సంతోషంగా ఉంది



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. 2002 జనవరి 21న ఉపాధ్యాయ వృత్తిలో చేరా. తన 22 ఏళ్ల సర్వీసులో 'సావిత్రి బాయి పూలే', లైన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. పేదల విద్యాభివృద్ధే లక్ష్యం. ప్రస్తుతం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపక కావడం సంతోషంగా ఉంది.

– జి. నాగేశ్వరయ్య, ఉపాధ్యాయుడు, ఎస్‌జీటీ, గుడుంబాయి తండా

విద్యార్థులకు సులభతర బోధన



విద్యార్థులకు పాఠాలు సులుభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నాం. విద్యార్థి పరిస్థితిని అర్థం చేసుకుని గణితం మెలకువలు వివరిస్తున్నా. గణితం ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు మక్కువ పెంచుతున్నా. ఉత్తమ ఉపాధ్యాడిగా అవార్డు వరించడం ఆనందంగా ఉంది.

–ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్కూల్ అసిస్టెంట్ జెడ్పీహెచ్‌ఎస్, గోరుకల్లు

ఆధునిక పద్ధతులను అందిపుచ్చుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీడీ శ్రీలత

సి.బెళగల్: ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని ఆత్మ డీపీడీ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామ రైతు సేవా కేంద్రంలో బుధవారం ఏఓ మల్లేష్‌కుమార్ సాగు పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీడీ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు గడించే వ్యవసాయ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు. పంటలలో కీటకాలు, పురుగుల గుర్తింపునకు లింగాకర్షక బుట్టల ఏర్పాటు, గులాబీ పురుగుల నివారణ పద్ధతులపై కర్నూలు ఇన్‌చార్జ్ ఏడీఏ దస్తగిరి, డీఆర్‌సీ ఏడీఏలు గిరీష్, వెంకటేశ్వర్లు తదితరులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ శశిధర్‌రెడ్డి, ఆత్మా ఏఓ మధుమిత తదితరులు రైతులకు సూచనలు, సలహాలను నూతన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం బురాన్‌దొడ్డి పంటలో లింగాకర్షక బుట్టల ఏర్పాటు విధానాలను తెలియజేశారు. సమావేశంలో వీఏఏలు మారెప్ప, శశికాంత్, ఎంపీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో బుధవారం మామపై అల్లుడు దాడి చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఎమ్మిగనూరు– గూడూరు ప్రధాన రోడ్డులో నివాసముండే ముందరింటి శ్రీనివాసులు కుమారుడైన వేణుగోపాల్‌కు తెలంగాణ రాష్ట్రం, ఐజా మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన యువతితో నాలుగేళ్ల క్రితం వివాహం అయ్యింది. వీరికి కుమారుడు సంతానంకాగా, ప్రస్తుతం ఏడు నెలల గర్భిణు. అయితే కుటుంబ సమస్యలతో ఆమె వెంకటాపురంలోని తల్లిదండ్రుల దగ్గర ఉంటుంది. ఈ క్రమంలో బుధవారం ముందరింటి శ్రీనివాసులు అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆమె తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి మామ అంత్యక్రియలకు సి.బెళగల్‌కు వచ్చారు. వారిని చూసిన వేణుగోపాల్ పాత సంఘటనలతో భార్య తండ్రి అయిన శ్రీనివాసులతో ఘర్షణపడ్డాడు. రాయితో మామ శ్రీనివాసులు తలపై కొట్టడంతో రక్త గాయాలు అయ్యాయి. దీనితో బాధితుడి బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సి.బెళగల్ పీహెచ్‌సీలో ప్రాథమిక వైద్యం చేసిన వైద్యులు బాధితుడిని కర్నూలుకు తరలించారు. బాధితుడి బంధువులు ముందరింటి శ్రీనివాసులు అంత్యక్రియలను అడ్డుకునేకుందు ప్రయత్నించారు. అయితే పోలీస్ బందోబస్తుతో ఎట్టకేలకు ముందరింటి శ్రీనివాసులు మృతదేహానికి అంత్యక్రియలు పూర్తయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

భూసేకరణపై అభ్యంతరాల సేకరణ



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరమణ

ఓర్వకల్లు: మండలంలోని ఎయిర్ పోర్టు విస్తరణలో భాగంగా అవసరమైన భూములను సేకరించుటకు బాధితుల నుంచి బుధవారం అధికారులు అభ్యంతరాలను సేకరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పూడిచెర్ల గ్రామానికి చెందిన భూ బాధితులతో తహసీల్దార్ వెంకటరమణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పూడిచెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 551 నుంచి 655 వరకు గల 38 ఎకరాల భూమిని ప్రభుత్వం గతంలోనే గుర్తించినట్లు తెలిపారు. ఆ భూములకు సంబంధించిన భూయజమానులు ఎయిర్ పోర్టుకు ఇవ్వడానికి అంగీకరిస్తే ఎకరాకు రూ.22 లక్షల చొప్పున పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతుల అభిప్రాయాల మేరకు ఆర్‌డీఓకు నివేదిక పంపిన తర్వాత చెక్కులను అందజేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో డీటీలు సుదర్శన్, సతీష్, వీఆర్‌ఓలు, రైతులు పాల్గొన్నారు.

చెరువులపై పర్యవేక్షణ ఉండాలి



కొచ్చెరువును పరిశీలిస్తున్న తహసీల్దార్ నరేంద్రకుమార్‌రెడ్డి

పాణ్యం: వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో చెరువులపై పర్యవేక్షణ ఉండాలని తహసీల్దార్ నరేంద్రకుమార్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మండల కేంద్రం పాణ్యం ఊరుముందరి చెరువుతో పాటు కొలమాలకు చెరువు, కొండజుటూరు, భూపనపాడు, ఆలమూరు, వడ్డుగండ్ల చెరువును తహసీల్దార్ పరిశీలించారు. అలాగే మైనర్ ఇరిగేషన్, నీరుకట్టులతో మాట్లాడారు. చెరువులకు వరదనీటి ప్రవాహం అధికంగా ఉన్నప్పుడు తప్పకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. చెరువుల సామర్థ్యం కంటే అధికంగా నీటినిల్వ ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా నీటిని దిగువకు విడుదల చేయాలని సూచించారు.

మినుము పంటను పరిశీలించిన ఏడీఏ



గడిగరేవులలో దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రాజశేఖర్, ఏఓ హేమసుందర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్

గడివేముల: సాక్షి దినపత్రికలో బుధవారం ప్రచురించిన 'వర్షం..పంటకు నష్టం'' కథనానికి వ్యవసాయ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఎడతెరపివ్వని వర్షాల మూలంగా మండలంలో ప్రత్యేకించి మినుము పంట దెబ్బతిన్న తీరును వివరించిన కథనానికి స్పందించిన ఏడీఏ రాజశేఖర్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఏఓ హేమ సుందర్‌రెడ్డితో కలిసి ఏడీఏ గడిగరేవుల, తిరుపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించారు. వర్షాలకు మినుము గింజలకు మొలకలు రావడాన్ని వారు గుర్తించారు. రెండు, మూడు రోజుల్లో నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏఓ తెలిపారు. మండలంలో దాదాపు నాలుగు వందల ఎకరాల మినుము పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని చెప్పారు.

పత్తి పంటకు శత్రువు గులాబీరంగు పురుగు



గులాబిరంగు పురుగు నివారణపై రైతులకు సూచనలిస్తున్న ఆత్మ డీపీడీ శ్రీలత

కోడుమూరు రూరల్: పత్తిపంట ప్రధాన శత్రువు గులాబీరంగు పురుగు అని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆత్మ డీపీడీ శ్రీలత సూచించారు. కోడుమూరులో పత్తి పంట సాగు చేసిన పొలంలో బుధవారం రైతులకు ఏఓ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో ఆత్మ శాస్త్రవేత్తల బృందం గులాబీ పురుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీడీ గులాబిరంగు పురుగు ఉధృతిని అరికట్టేందుకు పత్తి పంటలో లింగాకర్షక బుట్టలను ఎకరాకి 20చొప్పున మొక్క కన్నా అడుగు ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. రోజుకు 8చిలుకలు పడితే మూడు రోజులు గమనించి మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. వేపనూనె, ప్రొఫెనోపాస్‌తో కలిపి పిచికారీ చేస్తే గులాబి రంగు పురుగు గుడ్డును చంపి కంట్రోల్ చేయవచ్చునన్నారు. ప్రస్తుతం ఎక్కడ కూడా పత్తి పంటలో గులాబిరంగు పురుగు ఉధృతి లేదని, రైతులు అనవసరంగా మందులను పిచికారీ చేయరాదని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏలు గిరీష్, వెంకటేశ్వర్లు కర్నూలు ఏడీఏ దస్తగిరి రెడ్డి, ఏఓలు శశిధర్ రెడ్డి, మధుమతి, రైతు సేవా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం బాధ్యతగా భావించాలి



మొక్కలు నాటుతున్న డీసీఓ శ్రీదేవి, అధికారులు, ఉపాధ్యాయులు

సి.బెళగల్: పాఠశాలలో మొక్కలను పెంచడం విద్యార్థులు బాధ్యతగా భావించాలని డీసీఓ శ్రీదేవి పేర్కొన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉపాధి అధికారులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రిన్సిపాల్ బలరాముడు అధ్యక్షతన ఏపీఓ లక్ష్మన్న, ఈసీ వృద్ధిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీఓ పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో నటిన ప్రతి మొక్క సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు దత్తతగా అప్పగించాలని సూచించారు. కార్యక్రమంలో టీఏలు రామ్‌శంకర్, రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ విజయుడు, అధ్యాపకులు చింతలయ్య, పీడీ రాఘవేంద్ర, పీఈటీ ప్రభాకర్, ఏఫ్ఏలు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

యాచకురాలి ఔదార్యం

కోడుమూరు రూరల్: వరదబాధితుల కోసం గ్రామ పంచాయతీ అధికారులు చేపట్టిన విరాళాల సేకరణకు స్పందించి గోరంట్లకు చెందిన యాచకురాలు లచ్చమ్మ తన వంతు సాయంగా యాచించిన సొమ్ము రూ.516లను అందించి తన గొప్పతనాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా లచ్చమ్మను కోడుమూరు సర్పంచ్ భాగ్యరత్న అభినందించారు.

'చిత్రాలు' మధుర జ్ఞాపకాలు



లూయిస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాగరాజు, టీజీ వెంకటేష్, గౌరు చరితారెడ్డి

కల్లూరు: చిత్రాలు మధుర జ్ఞాపకాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం పెద్దపాడు రోడ్డులోని రాజ్ ఫంక్షన్ హాల్‌లో కర్నూలు ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్స్, డిజైనర్స్, ఎడిటర్స్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైవారు లూయిస్ డాగురె చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితంలో మధురస్మృతులను మిగల్చే ఫొటోలను అందిస్తున్న ఫొటోగ్రాఫర్లు అభినందనీయులని పేర్కొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కల్లూరు: రక్తదానం చేసి ప్రాణదాలుగా నిలవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో లీప్స్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన దాతలను ఈ సందర్భంగా వారు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందరెడ్డి, కేవీ సుబ్బారెడ్డి, ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, తాలుక సీఐ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీల నిర్మాణం ఆపొద్దు

కర్నూలు (సెంట్రల్): ఆదోని, పెనుగొండ మెడికల్ కాలేజీల నిర్మాణాలను ఆపాలని ప్రభుత్వం ఆగస్టు 30వ తేదీన ఇచ్చిన మెమోలను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదోనిలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంజూరైనందుకు ప్రజలు ఎంతో సంతోషపడ్డారని, మెమో జారీ చేయడం తగదని వాపోయారు.